


పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ గురువారం సాయంత్రానికి 44.20 టీఎంసీలకు చేరింది. దిగువకు 25,399 క్యూసెక్కులు వదిలారు.



నోటు పుస్తకాలు పంపిణీ

నిజాంపట్నం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం శివపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తహసీల్దార్ షాకీర్ పాషా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7026 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 2860 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

పతాకావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లా కలెక్టరేట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం, క్యాంపు కార్యాలయాల్లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు జాతీయ జెండా ఎగురవేసి పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జేసీ సూరజ్ ధనుంజయ గనోరే, డీఆర్‌ఓ కె.వినాయకం, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి ఆటల పోటీలు

నరసరావుపేట ఈస్ట్: విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్‌లో భాగమైన సరస్వతి శిశు మందిర్ విద్యాసంస్థల రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ఈనెల 17, 18 తేదీలలో నిర్వహిస్తున్నట్టు పాఠశాల సమితి అధ్యక్షుడు మిరియాల నాగప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఐదు జోనల్స్‌లో గెలుపొందిన దాదాపు 700మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పోటీలను ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు సౌత్ సెంట్రల్ పోటీలకు, అక్కడ విజయం సాధించన వారు జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారనీ, జాతీయ స్థాయిలో విజయం సాధించిన వారు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కిటకిటలాడిన ఆర్టీసీ బస్టాండ్



నరసరావుపేట ఈస్ట్: వరుస సెలవులు రావటంతో సొంత గ్రామాలకు వెళ్లే విద్యార్థులతో నరసరావుపేట బస్టాండ్ కళకళలాడింది. స్వాతంత్ర్య దినోత్సవం, వరలక్ష్మీ వ్రతం, వీకెండ్స్, రాఖీ పూర్ణిమ ఇలా వరుసగా సెలవులు రావటంతో విద్యార్థులు ఉత్సాహంగా సొంత గ్రామాలకు తరలివెళ్లారు. వీరికి తోడు వివిధ కారణాలతో గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడాయి.

నేడు భ్రమరాంబ అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

పెదకాకాని: పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని భ్రమరాంబ అమ్మవారిని పసుపు కొమ్ములతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఉప కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో దేవస్థానానికి విచ్చేసి శ్రీ భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు. శ్రావణమాస మూడో శుక్రవారం భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేకంగా మల్లెపూల అలంకరణ, నాల్గవ శుక్రవారం లక్ష గాజులతో శ్రీ భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేక అలంకరిస్తామని తెలిపారు.

నేడు వరలక్ష్మీదేవిగా దుర్గమ్మ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ వారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. వరలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు 70 వేల పైబడి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్లు తీసుకురావొద్దు..

ఆలయ ప్రాంగణంలోకి సెల్‌ఫోన్లు తీసుకురావడం నిషేధమనే విషయాన్ని భక్తులు గుర్తించాలని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. భక్తులు ఘాట్‌రోడ్డు, మహా మండపం క్యూలైన్‌లోకి ప్రవేశించే ముందే తమ సెల్‌ఫోన్లను కౌంటర్‌లలో భద్రపరుచుకోవాలని సూచిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో సెల్‌ఫోన్ వినియోగించినా, అమ్మవారి మూలవిరాట్‌ను ఫొటోలు తీసినా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

అభివృద్ధికి వందరోజుల ప్రణాళిక

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి
- జిల్లాలో 268మందికి ప్రశంసా పత్రాలు అందజేత
- ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు

పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్



జాతీయ జెండాను ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల

నరసరావుపేట: వంద రోజుల ప్రణాళికతో జిల్లాను అభివృద్ధి బాట పట్టిస్తామని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం వేదికగా జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. మంత్రి మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జెండా వందనంతో వేడుకలను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావులతో కలిసి మంత్రి ప్రత్యేక వాహనంలో పోలీసు, ఎన్‌సీసీ దళాల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా నుంచి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పుల్లరి హనుమంతును స్మరించుకుని మంత్రి తన ప్రసంగాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. 15 శాతం వార్షిక వృద్ధి రేటు లక్ష్యంగా జిల్లాలో 100 రోజుల ప్రణాళికలను అమలు చేయనున్నామని స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబరు 2 నుంచి 100 రోజుల ప్రణాళిక అమలవుతుందన్నారు. సొసైటీల ద్వారా జూన్ వరకు రూ.788.65కోట్ల వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు మంజూరు చేశామన్నారు. ఖరీఫ్ సీజనులో బ్యాంకుల ద్వారా వ్యవసాయ రుణాలు రూ.13,211కోట్లు ఇవ్వాలనేది లక్ష్యం కాగా రూ.5,602కోట్లు(42శాతం) ఇచ్చామన్నారు. ఎంఎస్‌ఎంఈలకు రూ.2,224కోట్ల లక్ష్యమైతే రూ.1050కోట్లు (47శాతం) మంజూరు చేయటం జరిగిందన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ ఫేజ్-1 ద్వారా వెల్దుర్తి మండలంలో 24,900ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.340.26కోట్లతో పరిపాలన అనుమతులు లభించాయని, రెండో దశ సర్వే పనులకు రూ.3,807కోట్లతో అనుమతులు మంజూరు అయ్యాయన్నారు. జిల్లాలో 2047పాఠశాలల్లో 2,17,342మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా వారిలో 1,54,454మందికి విద్యాకానుక పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.



మొదటి బహుమతి పొందిన మహిళా, శిశు సంక్షేమశాఖ శకటం

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన ..

ప్రత్యేకంగా ఆహ్వానించిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను మంత్రి ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్య, పంచాయతీరాజ్, పౌర సరఫరాలు, మహిళాభివృద్ధి - శిశు సంక్షేమం, గృహనిర్మాణ సంస్థ, వైద్య - ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, అటవీ శాఖల శకటాల ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగింది. దేశ భక్తి గీతాలకు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు..

కార్యక్రమంలో ఉత్తమ సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ శకటాలు, ఉత్తమ స్టాళ్లు, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను మంత్రి అందజేశారు. 43 మంది జిల్లా స్థాయి అధికారులు, 225 మంది ఇతర అధికారులు కలిపి మొత్తం 268 మంది ఉద్యోగులు మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పొందారు. చివరిగా వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, జాతీయ గీతంతో వేడుకలకు ముగింపు పలికారు. ఈ వేడుకలలో పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్‌ఓ కె.వినాయకం, జిల్లా స్థాయి అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, టీడీపీ నాయకులు




అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

జ్ఞాన'జ్యోతి'

- అద్దంకి ఆణిముత్యం జ్యోతి చంద్రమౌళి మాస్టారు
- చారిత్రక పరిశోధన రత్నగా పేరుప్రఖ్యాతులు
- శాసనాల పరిశోధన, గ్రంథ రచన, తాళపత్ర గ్రంథాల అధ్యయనంతో ఖ్యాతి
- ఎన్నో అవార్డులు, సత్కారాలు, సన్మానాలు

అద్దంకి: విద్వాన్ జ్యోతి చంద్రమౌళి.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరిచయం అక్కర్లేని పేరు. ఇంటిపేరుకు తగ్గట్టే ఆయన ప్రకాశించే 'జ్యోతి'. చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా కీర్తి గడించిన ఈయన బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు అనే కుగ్రామంలో జన్మించారు. తెలుగు ఉపాధ్యాయునిగా ప్రస్థానాన్ని ప్రారంభించి 24ఏళ్లపాటు పనిచేశారు. ఉద్యోగ విరమణ తర్వాత చారిత్రక, పురావస్తు పరిశోధకుడిగా మారారు. ప్రస్తుతం అద్దంకి రామనగర్‌లో నివాసం ఉంటున్నారు. రచయితగానూ గుర్తింపు సాధించారు. అనేక ప్రాంతాల్లో పర్యటించి పురాతన గ్రంథాలు, వస్తువులు గుర్తించి అధ్యయనం చేశారు. ఆలయాల్లో, తవ్వకాల్లో లభించిన శాసనాలను క్షుణ్ణంగా పరిశీలించి లిపిని అర్థం చేసుకుని కొత్త ప్రతులను తయారు చేశారు. తాళపత్ర గ్రంథాలను సేకరించి పుస్తక రూపం ఇచ్చారు. కొత్త విషయాలు తెలిస్తే పురావస్తు శాఖకు సమాచారం ఇస్తున్నారు. ఇప్పటికి ఈయన 30 శాసనాలను, ఏడు బౌద్ధ స్థూపాలను గుర్తించారు. పది తాళపత్ర గ్రంథాలకు పుస్తక రూపం ఇచ్చారు. జానపద కళలకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జానపద కళాపీఠం ప్రధాన కార్యదర్శిగా, ప్రకాశం జిల్లా పరిశోధనా సంస్థ అధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ లైఫ్ మెంబర్ షిప్, ఏపీ గ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా మెంబర్‌గా, మైసూరు ఆలిండియా థీయో బౌద్ధ ఆర్గనైజేషన్ కార్యవర్గసభ్యుడిగా, ధర్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.



మణికేశ్వరం వద్ద రాతి సమాధిని పరిశీలిస్తున్న చంద్రమౌళి (పాత చిత్రాలు)




తాళపత్రాలను పరిశోధిస్తున్న చంద్రమౌళి

చంద్రమౌళి రచనలు

అద్దంకి చరిత్ర, సృజన, సూక్తి కిరణాలు, స్ఫూర్తి రత్నాలు, నేటి భారతం, ప్రకాశం జిల్లా చరిత్ర, దళిత కిరణాలు, జానపద కళలు, మాండుకేశ్వర చరిత్ర, ప్రకాశం జిల్లాలో దర్శనీయ స్థలాలు, అద్దంకి సీమ చరిత్ర, తెలుగు నిఘంటువుతోపాటు 26 గ్రంథాలను రచించారు.

పొందిన అవార్డులెన్నో..

చంద్రమౌళి గతంలో జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందారు. అధికార భాషా సంఘ ప్రతిభా పురస్కారం, ఉత్తమ రచయితగా, ఉత్తమ పరిశోధకునిగా, రెండు సార్లు ప్రకాశం జిల్లా విశిష్ట వ్యక్తిగా గౌరవాలను స్వీకరించారు. మద్రాసులోని ఆంధ్ర కళాసమితి ఉగాది సత్కారం, భారతీయుడు, పరిశోధనా భాస్కర, మద్రాసులోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ, అమరావతి వారిచే చారిత్రక పరిశోధనా రత్న, జానపద కళానిధి వంటి ఎన్నో అవార్డులు, సన్మానాలు అందుకున్నారు.



త్రివర్ణ సాగరం

విజయపురిసౌత్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం నాగార్జున సాగర్ డ్యాం త్రివర్ణ శోభితమైంది. ప్రత్యేక దీపాలు అమర్చడంతో జలాశయం త్రివర్ణ కాంతులు వెదజల్లుతూ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. జలాశయం రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి 16,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

పక్కాగా పశువుల లెక్క

- సెప్టెంబరు 1 నుంచి 21వ జాతీయ పశుగణన
- నాలుగు నెలలపాటు నిర్వహణ
- 297 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- జిల్లాలో 5.55 లక్షల నివాసాల్లో గణనకు ఏర్పాట్లు

సత్తెనపల్లి: జిల్లాలో పశువుల లెక్క ఇక పక్కాగా ఉండనుంది. మనుషుల మాదిరిగానే మూగ జీవాల గణన జరగనుంది. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియ వచ్చేనెల ఒకటి నుంచి మొదలుకానుంది. జిల్లాలో 21వ జాతీయ పశుగణనను ప్రారంభించేందుకు పశు సంవర్ధక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే పశుగణన చేపట్టే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు నాలుగు నెలల పాటు నిర్వహించే పశుగణనలో మూగజీవాల లెక్క తేలనుంది. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు పక్కాగా పశుగణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 297 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. ఎన్యూమరేషన్ అనంతరం నిర్దేశించిన అధికారులు స్క్రూటినీ చేస్తారు. వీరంతా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు పి.రామారావు పర్యవేక్షణలో పశుగణన చేపట్టనున్నారు.

ప్రతి ఐదేళ్లకోసారి...

దేశంలో తొలిసారిగా జాతీయ పశుగణనను 1919-20లో చేపట్టారు అప్పటి నుంచి ప్రతి ఐదేళ్లకోసారి గణన చేపడుతున్నారు. పశువుల జీవిత కాలం తక్కువగా ఉంటుంది. అదే సమయంలో పునరుత్పత్తి శక్తి అధికంగా ఉంటుంది. అందువల్ల ప్రతి ఐదేళ్లకోసారి జాతీయ పశుగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. ప్రస్తుతం 21వ జాతీయ పశుగణన ప్రారంభం కానుంది.



పశుగణన షెడ్యూల్, మాన్యువల్స్‌ను విడుదల చేస్తున్న పశుసంర్ధక శాఖ అధికారులు

లెక్క పెట్టేది ఇలా...

పశుగణనలో భాగంగా గ్రామాల్లోని ప్రతి నివాసాన్ని ఎన్యూమరేటర్ సందర్శిస్తారు. గేదెలు, ఆవులు, వాటి జాతులు, కోళ్లు, వాటి జాతి రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతులను నమోదు చేస్తారు. ప్రతి రెవెన్యూ విలేజ్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. ఈ విధంగా జిల్లాలో 603 రెవెన్యూ గ్రామాలు, వార్డులను 297 మంది ఎన్యూమరేటర్లకు కేటాయించారు. గతంలో ట్యాబ్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే గణన చేపట్టగా... ఈసారి ఎన్యూమరేటర్ ఫోన్‌లోనే యాప్ ద్వారా గణన చేయనున్నారు. జిల్లాలో 5,55,150 నివాసాలను గణన చేయాల్సి ఉంది. ఆవుల్లో రకాలు, కోళ్లల్లో టర్కీ, నాటు, కముజు పిట్టలు, ఫారం కోళ్లు, రకాలు ఉంటాయి. అలాగే మేకలు, గొర్రెలు, పొటేళ్లు, పందులు, కుక్కలు, పెరటి కోళ్లు, బాతులు, సేద్యపు ఎద్దులు, ఇలా వేరు వేరుగా నమోదు చేయాలి. పశుసంపదతో పాటు ఆ గ్రామంలో పశు వైద్యశాల ఉందా? లేదా? పాల సేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా? లేవా? పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారా? లేక సొంతంగా చేపడుతున్నారా? తదితర విషయాలను నమోదు చేయాల్సి ఉంటుంది. పశు యజమాని అక్షరాస్యుడా? నిరక్షరాస్యుడా? పశుసంపద ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? పశువుల షెడ్డు ఉందా? లేక ఆరు బయట పశువులను కడుతున్నారా? గొర్రెల సొసైటీలు ఉన్నాయా? పశువధశాల ఉందా? పశువుల సంరక్షణలో పురుషులు/ స్త్రీలు ఎవరు ఎక్కువ సంరక్షణ చేస్తున్నారనే విషయాలను కూడా పశుగణకులు సేకరించనున్నారు.

సమాచారం ఇవ్వకుంటే నష్టం..

పశుగణన ఆధారంగానే జిల్లాకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ రానుంది. పశువుల సంఖ్యను బట్టి వ్యాధి నిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా చేస్తారు. ఇదంతా సక్రమంగా జరగాలంటే రైతులు ఖచ్చితమైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందజేయాలి. అయితే చాలా మంది రైతులు పశుసంపద సమాచారాన్ని పూర్తిస్థాయిలో ఇచ్చేందుకు నిరాకరిస్తుంటారు. పూర్తి సమాచారం ఇస్తే ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తామన్న అపోహలతో సమాచారం ఇవ్వరు. దీనివల్ల పరోక్షంగా రైతులకే నష్టం చేకూరుతుందని పశు వైద్యులు పేర్కొంటున్నారు.

ముగిసిన జేఎన్‌వీ హ్యాండ్‌బాల్ పోటీలు

ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన వైజాగ్

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా విద్యార్థులు ఎదగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆకాంక్షించారు. పల్నాడు జిల్లా పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజులు నిర్వహించిన ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు అధ్యక్షతన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడారంగంపై కూడా ఆసక్తి చూపాలన్నారు. యూబీఐ నరసరావుపేట రీజియన్ హెడ్ టి.మాధురి మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ధనలక్ష్మి గ్రూప్స్ డైరెక్టర్ సాధినేని హనుమంతరావు, జేఎన్‌వీ విశ్రాంత సహాయక సంచాలకులు సి.ప్రభాకరరెడ్డి, యూబీఐ మేనేజర్ రోహిత్‌సిన్హా, డాక్టర్ రాజశేఖర్‌లు మాట్లాడారు. అనంతరం ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రత్నాంబిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

వైజాగ్ జేఎన్‌వీకి ఓవరాల్ చాంపియన్‌షిప్

జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్‌ను విశాఖపట్నం జేఎన్‌వీ సాధించింది. క్యాలికట్, కోలార్, మహబూబ్‌నగర్, నెల్లూరు, రాయచూర్, విశాఖపట్నం, షిమోగా, త్రిశూల్ ప్రాంతాలకు చెందిన 430 మంది క్రీడాకారులు పాల్గొని హోరాహోరీగా తమ ప్రతిభా నైపుణ్యాలను చాటారు. అండర్-14, అండర్ -17, అండర్ -19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ప్రతిరోజు 12 మ్యాచ్‌ల చొప్పున పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం జేఎన్‌వీ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, అండర్ -14 బాలుర విభాగంలో.. విశాఖపట్నం క్లస్టర్, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ -17 బాలుర విభాగంలో విశాఖపట్నం, బాలికల్లో కోలార్ క్లస్టర్, అండర్ -19 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్, బాలికల్లో విశాఖపట్నం క్లస్టర్లు ప్రథమస్థానంలో నిలిచి త్వరలో జరగనున్న జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అర్హత సాధించాయి. ప్రథమస్థానంలో నిలిచిన ఒక్కో జట్టుకు 12 మంది చొప్పున మొత్తం 72 మంది జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.

ప్రతిభకు పురస్కారం



మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా మెడల్ అందుకుంటున్న జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరాజు, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

రామచంద్రరావు, డీఎఫ్ఓ
వినాయకం, డీఆర్ఓ
పి.సరోజిని, ఆర్డీఓ, నరసరావుపేట
జీవీ రమణకాంత్‌రెడ్డి, ఆర్డీఓ, గురజాల
వి.మురళీకృష్ణ, ఆర్డీఓ, సత్తెనపల్లి
రవిచంద్ర, డీఎస్పీ
మురళి, జిల్లా వ్యవసాయ అధికారి
అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం, డీపీఎం
బాలునాయక్, డీఆర్‌డీఏ, పీడీ
జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ
రాజానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ
వై.సి.సుబ్బరాయుడు, పీఆర్ ఈఈ
సంజీవరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ
ఓబుల్‌నాయుడు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్
ఎస్.పద్మశ్రీ, జిల్లా పౌర సరఫరాలు
లోతేటి వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమం
జి.వరలక్ష్మి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, డీఎం
డి.వరలక్ష్మి, జలవనరుల శాఖ, ఎస్ఈ
దీప్తి, ఐఅండ్‌పీఆర్, డీడీ
సిహెచ్ ఆంజనేయులు, జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్
కె.ఉమారాణి, ఐసీడీఎస్, పీడీ
రమణారెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి
శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ, ఈఈ
ఎన్వి శ్రీనివాసరావు, జిల్లా ప్రజారవాణా అధికారి
కాంతారావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి
గాంధీ, ఏఆర్ డీఎస్పీ
ఎ.కార్తీక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకార కార్యాలయం
అలహరి శ్రీనివాస్, సీఐ
శోభన్‌బాబు, సీఐ, వినుకొండ టౌన్
బ్రహ్మయ్య, సీఐ
చరణ్, సీఐ, నరసరావుపేట వన్‌టౌన్
అశోక్‌కుమార్, సీఐ, డీసీఆర్‌బీ
పి.నారాయణస్వామి, జిల్లా సహకార శాఖ
డి.శ్రీనివాసరావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి
సురేష్‌బాబు, సీఐ, ఎస్‌బీ
రమణ్, ఏఎస్ఐ
స్వర్ణా చినరామిరెడ్డి, సాంఘిక సేవ
పి.వెంకటశరత్, రెడ్‌క్రాస్

నరసరావుపేటలోని కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణం వేదికగా గురువారం జరిగిన 78వ స్వాతంత్య్ర దినోత్సవాల్లో భాగంగా ఉత్తమ సేవలు అందించిన అధికారులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు

నరసరావుపేట: 78వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు సిబ్బంది, ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అడ్మిన్ అదనపు ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ జి.రామచంద్రరాజు, శాంతిభద్రతల అదనపు ఎస్పీ లక్ష్మీపతి, సిబ్బంది పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో డ్రోన్ కలకలం

పట్నంబజారు: స్వాతంత్య్ర వేడుకల్లో ఒక యూట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా చేసిన పని కలకలం రేపింది. పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం స్వాతంత్య్ర వేడుకలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో నందిని అనే ఓ యూ ట్యూబర్ ఎటువంటి అనుమతులు లేకుండా పేరేడ్ గ్రౌండ్స్‌లో స్వాతంత్య్ర వేడుకలు చిత్రీకరించేందుకు డ్రోన్ వినియోగించింది. దీంతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గ్రౌండ్స్‌లో అలజడి వాతావరణం ఏర్పడింది. వీఐపీలు అధికంగా ఉన్న వేళ అనుమతులు లేకుండా నందిని డ్రోన్ ఎగురువేసిన నేపథ్యంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని డ్రోన్ స్వాధీనం చేసుకున్నారు. నగరంపాలెం పోలీసుస్టేషన్ తరలించి విచారించారు. అనంతరం ఆమె యూట్యూబర్ అని తెలుసుకుని, అనుమతులు లేకుండా ఇటువంటి కార్యక్రమాలు చిత్రీకరించకూడదని సూచించి పంపించివేశారు. నందిని తండ్రి బొల్లాపల్లి ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.

శకటం.. ప్రగతికి చిహ్నం

నరసరావుపేట: స్థానిక కేఎస్‌పీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో శాఖల వారీగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ప్రదర్శనలో విజేతలను ప్రకటించారు. అందులో శకటాల విభాగంలో మహిళా, శిశు సంక్షేమ శాఖకు చెందిన వాహనానికి మొదటి బహుమతి, వ్యవసాయ, అనుబంధ సంస్థల శకటానికి ద్వితీయ బహుమతి, గృహ నిర్మాణ శాఖకు చెందిన శకటానికి తృతీయ బహుమతి లభించాయి. అదేవిధంగా స్టాళ్ల ఏర్పాటులో వ్యవసాయ శాఖ ప్రథమ బహుమతి, డ్వామా(జిల్లా నీటి యాజమాన్య సంస్థ) ద్వితీయ బహుమతిని పొందగా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ స్టాల్ తృతీయ బహుమతి సాధించింది.



మొదటి బహుమతి పొందిన వ్యవసాయశాఖ స్టాల్

నరసరావుపేట: కేఎస్‌పీఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవాల్లో పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అలాగే పోలీసు జాగిలం ప్రదర్శించిన విన్యాసాలను ముఖ్యఅతిథులతో పాటు, ప్రేక్షకులు అందరూ ఆసక్తితో తిలకించారు. ఈ జాగిలం 267 కేసుల్లో పోలీసులకు క్లూస్ ఇచ్చి నిందితులను పట్టుకునేందుకు సహకరించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.



ద్వితీయ బహుమతి పొందిన తమ శకటంతో పరేడ్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి, అధికారులు, సిబ్బంది



స్టేడియంలో విన్యాసాలు చేస్తున్న పోలీసు జాగిలం

నాయకులు, కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- టీడీపీ కూటమి నేతల చేతిలో గాయపడిన ఏడుగురికి రూ.5లక్షలు చెక్కులు అందజేత

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ వారిపై దాడులు, హత్యలు మానుకొని చేసిన వాగ్దానాల అమలు, ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో గత రెండు నెలలుగా కూటమి నాయకుల చేతిలో గాయపడిన, ఆస్తులు ధ్వంసమైన ఏడుగురికి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన రూ.5లక్షల చెక్కులను అందజేశారు.

నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన కొంగిటాల రామయ్య, రొంపిచర్ల మండలం పరగటిచర్లకు చెందిన బొచ్చు వెంకటరావు, కామినేని వెంకయ్యలకు రూ.లక్ష చొప్పున మూడు చెక్కులను అందజేశారు. అలాగే నరసరావుపేటకు చెందిన అలవాల వెంకటరామిరెడ్డి, కందవల్లి రాజ, పమిడిపాడుకు చెందిన కుప్పనపోయిన శ్రీనివాసరావు, పాలపాడుకు చెందిన చత్తి హరేంద్రలకు రూ.50వేలు చొప్పున చెక్కులు అందజేశారు. వచ్చే ఐదేళ్లలో పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.





బాధితులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు దారుణం

- రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొల్లా మాట్లాడుతూ నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డిపై తెలుగుదేశం పార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. కేవలం కక్ష పూరితంగానే గృహదహనం కేసు బనాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి రాజకీయాలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. అలాగే నడిగడ్డలో సొసైటీ ప్రెసిడెంట్‌పై అక్రమకేసులు బనాయించారని అన్నారు. గతంలో రుణం మంజూరు చేసిన అధికారులే డాక్యుమెంట్లు సరిగా లేదని కేసులు నమోదు చేయడమేమిటని ప్రశ్నించారు. తాను ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దమ్ముంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమకేసులు బనాయించడం, ప్రజలపై దాడులు మానుకుని, పరిపాలనపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

నరసరావుపేట ఈస్ట్: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి డిమాండ్ చేశారు. యుటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం మున్సిపల్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో యుటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ఎన్నోఏళ్లుగా ప్రమోషన్లు, బదిలీలు లేవని, విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు లేక పని ఒత్తిడి పెరిగిందని తెలిపారు. పని సర్దుబాటులో మున్సిపల్ ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాలలకే పరిమితం చేయాలని కోరారు. సర్వీసు నిబంధనలు లేవనే సాకుతో దశాబ్దాల తరబడి నియామకాలు, ప్రమోషన్లకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానంతరం ర్యాలీగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకొని డీఈఓ ఎం.వెంకటేశ్వర్లుతో చర్చలు జరిపారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. యూటీఎఫ్ నాయకులు ఎం.మోహనరావు, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు ఒ.కోటేశ్వరరావు, కె.తిరుపతిస్వామి, ఉషాశౌరిరాణి పాల్గొన్నారు.



డీఈఓ వెంకటేశ్వర్లుతో చర్చిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అమరవీరుల త్యాగ ఫలితమే స్వాతంత్య్రం

పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్

కొరిటిపాడు(గుంటూరు): ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్య్రం వచ్చిందని, వాటి ఫలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భారత పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబులు పేర్కొన్నారు. జీటీ రోడ్‌లోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని చైర్మన్ యశ్వంత్‌కుమార్ ఆవిష్కరించారు. యశ్వంత్‌కుమార్, శ్రీధర్‌బాబులు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఫలాలు పేదలకు అందించినప్పుడే ఉద్యమవీరుల త్యాగం సార్థకం అవుతోందన్నారు. ప్రతిఒక్కరూ తమ బాధ్యతలు, విధులను నిర్వర్తించి దేశ పురోభివద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. పొగాకు బోర్డులో అందరి సమిష్టి కృషి, టీంవర్క్ ఫలితంగా పొగాకు వేలం అమ్మకాలను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి పొగాకు బోర్డు ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు తమ తమ విధులను ఘనంగా నిర్వహించారని కొనియాడారు. ప్రతిఒక్కరూ దేశం, దేశభక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. 78 సంవత్సరాల స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల జ్ఞాపకార్థం, పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం ఆవరణలో ఇంటర్, పదవ తరగతిలలో అత్యధిక మార్కులు సాధించిన పొగాకు బోర్డు సిబ్బంది సభ్యులకు బహుమతులను అందజేశారు. అంతేకాకుండా బోర్డు సిబ్బందికి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ శ్రీధర్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సత్తెనపల్లి: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం భృగుబండ గ్రామానికి చెందిన కొల్లి రోహిత్‌రెడ్డి అలియాస్ లక్ష్మారెడ్డి (22) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం వెళ్లదీస్తుంటాడు. లక్ష్మారెడ్డి కవల సోదరుడు కొల్లి రామకృష్ణారెడ్డి ఉద్యోగం చేస్తుంటాడు. ఇద్దరూ కవల పిల్లలు అయినప్పటికీ సోదరుడు చదువుకొని ఉద్యోగం చేస్తుండటం, లక్ష్మారెడ్డి ఏడో తరగతి వరకే చదువుకుని, వ్యవసాయ పనులకు పరిమితమయ్యాడు. గ్రామంలో ఎంతోమంది యువకులు చదువుకొని ఉద్యోగాలు చేస్తుండగా తాను చదువుకోలేకపోయానని బాధతో మనస్తాపం చెంది ఈ నెల 13న గ్రామంలోని పొలంలో గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. అదేరోజు రాత్రి ఇంటికి వెళ్లి వాంతులు చేసుకోవడంతో గుర్తించిన తల్లి, తాతయ్యలు వెంటనే గ్రామంలో ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. లక్ష్మారెడ్డి చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. చేతికి వచ్చిన బిడ్డ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం భృగుబండ గ్రామానికి తరలించారు.